క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. అలాగే పొడుపు కథలు గురించి వివరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గొల్లవిల్లి చైతన్య, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు

దశ మహావిద్యలపై ప్రవచనం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

సీతంపేట : లలితాపీఠంలో జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాలలో భాగంగా మూడో రోజు 'దశ మహావిద్యల ఆవిర్భావం'కు సంబంధించి పురాణ విశేషాలపై లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. దశ మహావిద్యలలో చిన్నమస్త అనే శక్తి దేవత స్వరూప స్వభావాలను ప్రవచించారు. అలాగే రేణుకా దేవి కథలోని అంతరార్థం విశ్లేషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు, పండితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం

మహారాణిపేట: కేజీహెచ్ వైఎస్సార్ టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కింగ్ జార్జి ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను సన్మానించారు. ఒక దళిత బిడ్డ కేజీహెచ్ సూపరింటెండెంట్ కావడం ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి ఆయన పాటు పడతారని యూనియన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వి. లక్ష్మణ, నాయకులు రమణ, పి. వెంకట్రావు, ఎస్. రాజారావు, సీహెచ్ లీలాకృష్ణ, బి. పార్వతి, ఎస్.కె. బేగం, డి. రాజేశ్వరి, జి. అప్పారావు, సెక్రటరీ కె. రామారావు, నూకరాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ప్రభుత్వ నర్సుల సంఘం నాయకురాళ్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. అక్కయ్యపాలెంలోని గొల్లలపాలెంకు చెందిన నడిపిల్లి తేజ ఓ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతూ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ దరి ఓ హోటల్ నుంచి ఐటీఐ జంక్షన్ సమీపంలో ఫుడ్‌ను డెలివరీ చేసేందుకు ఊర్వశీ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో తేజకు తీవ్రగాయాలయ్యాయి. అతను ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

ముత్యాలమ్మా.. చల్లగ చూడమ్మా

- అట్టహాసంగా ముత్యమాంబ పండగ
- ముత్యాలమ్మపాలెంలో ఆధ్యాత్మిక సందడి



ముత్యమాంబను దర్శించుకొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు



అమ్మవారి అనుపోత్సవంలో పాల్గొన్న భక్తజనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం భక్త జనసంద్రమైంది. గంగపుత్రుల ఇలవేల్పు అయిన ముత్యమాంబ అమ్మవారి పండగ పురస్కరించుకుని గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. అన్ని వీధులు విద్యుత్ కాంతులతో మెరిసిపోయాయి. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, పరవాడ సర్పంచ్ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బి.రామారావు, ముత్యాలమ్మపాలెం ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, నాయుడుపాలెం మాజీ సర్పంచ్ కె.సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తాగునీరు, ప్రసాదం పంపిణీ చేశారు. రాత్రికి అమ్మవారిని డప్పులు, నేల డ్యాన్సులు, మేళతాళాలతో సతకం పట్టు నుంచి ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చారు. భారీ బాణ సంచాకాల్పుల నడుమ అనుపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు

ఘనంగా గ్రామదేవతల అనుపోత్సవం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామ దేవత పైడితల్లమ్మ, గొటివాడ గ్రామంలో కొలువైన పరదేశమ్మవార్ల అనుపు మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లగిశెట్టిపాలెంలో అమ్మవారిని సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్.. గొటివాడలో పరదేశమ్మను సర్పంచ్ సాలాపు మీణ,వెంకటేశ్వర రావు దంపతులు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు.



పూజలందుకున్న పైడితల్లమ్మ

సంక్షేమం... అభివృద్ధి రెండుకళ్లు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- అడవివరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని 527 సచివాలయం పరిధిలో కాపువీధి, సింహగిరి ఘాట్‌రోడ్డు, కుమ్మరిదిబ్బ ఏరియాల్లో మంగళవారం రాత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎవరెవరికి ఎంతెంత లబ్ధి చేకూరిందో గణాంకాలతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చారన్నారు. ప్రతీ పేదవాడి కళ్లలో ఆనందం చూడాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని కోరారు.

ముత్తం శెట్టి దృష్టికి సమస్యలు

ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాపువీధిలో వీధి దీపాలు వెలగడం లేదని, రోడ్లు లేవని నిర్వాసితులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈని పిలిచి లైట్లు వేయాలని సూచించారు. ప్రధానంగా సింహాచలం దేవస్థానంతో తమ గ్రామం ముడిపడి ఉండటంతో శిథిలమైన ఇళ్లను కూడా మరమ్మతులు చేసుకోలేని దుస్థితి ఉందని నిర్వాసితులు ఎమ్మెల్యేకు వివరించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల పరిశీలించారు. నెల రోజుల్లో బాధితులకు శుభ వార్త అందుతుందని హామీ ఇచ్చారు. సింహాచలం దేవస్థానం భూసమస్య పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ జెడ్సీ మల్లయ్య నాయుడు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, మజ్జి ధర్మా,లోగిశ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం విశేషంగా ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంప జేసి అష్టోత్తరశతనామావళిపూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని దిశానిర్దేశం చేస్తూ సీఎం వైఎస్ జగన్ గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించారన్నారు. దానిలో భాగంగా ప్రతి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. జీవీఎంసీ 93వ వార్డు 492 సచివాలయం పరిధిలోని ప్రహ్లాదపురంలో మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, 94వ వార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, నాయకులు బండి సత్తిబాబు, సూరిబాబు, వినోద్, వర్మ, శ్రీకాంత్, హర్ష, హరి, ఏపీడీ శ్రీరామ్, ఏఈలు కుమార్, వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం -గుల్లేపల్లి రోడ్డు పనులన పరిశీలన



సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని సబ్బవరం పాత రోడ్డు నుంచి గుల్లేపల్లి వరకూ విస్తరించి అభివృద్ధి చేయనున్న రోడ్డును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. వీఎంఆర్డీఏ ప్లానింగ్ అధికారులతో కలిసి పనులను ఆయన పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే పలు గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,ఎంపీటీసీలు బైలపూడి దేముడు బాబు, సింగంపల్లి శ్రీనివాసరావు, సబ్బవరపు నాగభూషణం,సబ్బవరపు సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

15 వేల మొక్కలు నాటడం లక్ష్యం

రాంకీ ఎండీ లాల్‌కృష్ణ



మొక్క నాటుతున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ



రాంకీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఉద్యోగుల సహకారంతో ఈ ఏడాది 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్‌కృష్ణ ప్రకటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా రాంకీ ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మాసిటీలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. అది మన సంస్కృతిలో ఓ భాగం కావాలన్నారు. ఈ ఏడాది ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రపంచ పర్యావరణ శాఖ థీమ్‌గా ఎంచుకోవడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్, ఎస్సే రైటింగ్, స్లోగన్ రైటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాంకీ ప్రతినిధులు చంద్రశేఖర్, మోహన్, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను గుర్తించండి



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్డీవో) డి. హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు . మంగళవారం సాయంత్రం తన చాంబర్లో 2023 నైరుతి-పశ్చిమ రుతుపవనాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల సమన్వయంతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులుంటే వెంటనే సరి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు - భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు . జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో మనోరంజని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగ సందడి



మూడుగుళ్ల వద్ద మహిళల కోలాటం



ప్రతిమలను ఊరేగిస్తున్న మహిళలు



పూజలందుకుంటున్న అమ్మవారు

సీతంపేట: సీతంపేట, అక్కయ్యపాలెం గ్రామ దేవతల పండుగలతో ఆయా ప్రాంతాల్లో పండగ సందడి నెలకొంది. అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గౌరీ సేవాసంఘం ఏర్పాట్లు చేసింది. ఉత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత ఉత్సవం జరిగింది. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి పసుపు,కుంకుమ, మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి ఘటాలను రామాలయం నుంచి మూడుగుళ్ల వరకు మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ల, కోలాటం, గరిడీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ఎస్‌జేవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 13న కుంచుమాంబ ఉత్సవం, 19న పుట్టబంగారమ్మ వేడుకలు, తొలేళ్ల సంబరం జరుగుతుందన్నారు. 20న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని తెలిపారు. సంఘం అధ్యక్షులు కొయిలాడ వేణుగోపాల్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి ఆడారి పొరుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతంపేటలో... : సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ నెల 11న అమ్మవారి పండుగ చాటింపు, 12న తొలేళ్ల పండుగ, 13న కనకమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

సింహాచలం: తొమ్మిదేళ్ల పాలనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. ప్రధానిగా మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా పెందుర్తిలో మంగళవారం బీజేపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ రక్షణ రంగాన్ని పటిష్ట పరిచిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, 93వవార్డు ప్రధాన కార్యదర్శి కల్యాణ్‌కుమార్, పార్టీ నాయకుల సైలాడ ధనుంజయరావు పాల్గొన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అమృతకాలం

- జాతీయస్థాయిలో ఏయూకు అగ్రాసనం
- యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతున్న స్టార్టప్‌లు
- పెరుగుతున్న వర్సిటీ పేటెంట్‌ల సంఖ్య



ఏయూ మెయిన్ గేట్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతోంది. వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి దార్శనికులు వేసిన బలమైన పునాదులపై నిర్మితమైన విశ్వవిద్యాలయం నేడు మరింత ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్సిటీకి అమృతకాలంగా చెప్పవచ్చు.

ఆవిష్కర్తలుగా నిలిపే 'ఆ హబ్'

నాలుగేళ్ల కిందట ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏయూలో స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేని విధంగా స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'కి ప్రాణం పోశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సీఈవోను నియమించి.. నేడు వందకు పైగా అంకుర సంస్థలు, 500 మందికి పైగా యువత పనిచేసేలా తీర్చిదిద్దారు. దీనికి చేరువలో రూ.22 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాయంతో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించి, మరిన్ని స్టార్టప్‌లకు ఊతం అందించారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్

కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 43వ స్థానం సాధించింది. ఇటీవల ది వీక్-హన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానాన్ని సాధించింది. అఖిల భారత స్థాయిలో టాప్ 10లో ఏయూ నిలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఏయూ పని చేస్తోంది.

చెయిర్ ప్రొఫెసర్.. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్

యూజీసీ ప్రారంభించే ప్రతి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఏయూ ముందుంటోంది. ఎన్ఈపీ 2020ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే శతశాతం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతకు మరింత బలాన్ని అందించే విధంగా ఏయూ పని చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేనన్ని చెయిర్ ప్రొఫెసర్లను ఏయూ ఇప్పటికే సాధించింది. అఖిల భారత స్థాయిలో అడుగిడిన తొలి సంవత్సరమే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో 4 స్టార్ ర్యాంకింగ్ సాధించింది.

పేటెంట్‌ల ప్రవాహం

ఏయూలో రెండేళ్ల కిందట ఏర్పాటైన ఐపీఆర్ చెయిర్ ఎంతో ప్రభావవంతంగా పని చేస్తోంది. ఇప్పటికే 70కి పైగా పేటెంట్‌లను వర్సిటీ నుంచి దాఖలు చేయడం, పదుల సంఖ్యలో పేటెంట్‌లు సాధించడం చకచకా జరిగిపోయింది.

నాడు-నేడుతో భవనాలకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో భవనాలు, హాస్టళ్ల పూర్తిస్థాయిలో తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, మైదానాలు వర్సిటీకి అతిపెద్ద వనరుగా నిలుస్తున్నాయి. అన్యాక్రాంతమైన వందలాది కోట్లు విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల చిత్తశుద్ధి సైతం విశాఖ ప్రజల అభిమానాన్ని చూరగొంది.

ఉపాధి అవకాశాల వెల్లువ

వర్సిటీలో ఇప్పటికే ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించి, రికార్డ్ సృష్టించింది.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న సహస్ర తులసిపూజ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.